## మట్టి వినాయకుడిని పూజించండి నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించుకోవడం శ్రేయస్కరమని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఓ ప్రకటనలో కోరారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాల ఆవశ్యకత ప్రజలందరూ గుర్తించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర పదార్థాలతో తయారుచేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని స్పష్టం చేశారు. అలాగే గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు ప్రసాదాల పంపిణీలో ప్లాస్టిక్ నిషేధాన్ని తప్పనిసరిగా అమలు పరచాలని అన్నారు. ప్రసాదాల పంపిణీ కై వినియోగించే కప్పులు ప్లాస్టిక్ వి కాకుండా కాగితంతో తయారు చేసినవి గాని, ఆకులతో తయారు చేసినవి గాని వినియోగించాలని చెప్పారు. ప్రజలందరూ సహకరించి ప్లాస్టిక్ రహితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని కోరారు.



## నగర ప్రాశస్త్యం ప్రతిబింబించే లోగో తయారుచేయండి

### నగర పాలక సంస్థ కమిషనర్

విశాలాంధ్ర-విజయనగరం : విజయనగరం నగర ప్రాచీనత, పురాణ ప్రసిద్ధతను, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే విధంగా ఒక అధికారిక చిహ్నం (లోగో) ను తయారుచేయాలని చిత్రకారులను నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో కోరారు. విజయనగరం మున్సిపల్ అసోసియేషన్ గా 1888వ సంవత్సరంలో ఏర్పడి దినదినాభివృద్ధి చెందుతూ 2019 జూలై 2వ తేదీన విజయనగరం నగరపాలక సంస్థగా ఏర్పాటైందనీ, అయితే విజయనగరం నగరపాలక సంస్థగా ఏర్పాటై సుమారు ఐదు సంవత్సరాలు కావస్తున్న అధికారిక చిహ్నం లేనందున తగిన లోగో ఆవశ్యకత వుందని తెలిపారు. చిత్రకారులు తాము రూపొందించిన విజయనగరం నగరపాలక సంస్థ (VIZIANAGARAM MUNCIPAL CORPORATION,VMC) లోగోను 98499 06486 నెంబర్ కు వాట్సప్ ద్వారా గాని, commvzm@yahoo.com అనే ఈమెయిల్‌లో గాని పంపించవలసిందిగా కోరారు. వచ్చిన లోగోలలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రజాభిప్రాయం కొరకు వాట్సప్ లో ఓటింగ్ నిర్వహించి మెజార్టీ ప్రజాభిప్రాయం వ్యక్తం చేసిన లోగోను కౌన్సిల్ వారి ముందుంచి, ఎంపిక జరుగుతుందన్నారు. లోగో విడుదల సందర్భంగా దుశ్శాలువ, జ్ఞాపికతో ఎంపిక కాబడిన లోగో రూపకర్తకు 1,116 రూపాయల పారితోషకంగా ఇచ్చి సత్కరించడం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. లోగోను ఈ నెల 30 తేదీలోగా పంపాలని కోరారు.

## చెరువు కబ్జా స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్ సురేష్

### విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర -,భోగాపురం: విశాలాంధ్రలో ప్రచురితమైన "చెరువులోకి నీరు వెళ్లే కాలువ కబ్జా" అనే కథనానికి రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. వివరాల్లోకి వెళితే మండలంలో భోగాపురం నుండి బంటుపల్లి వెళ్లే త్రోవలో పేర్రాజు చెరువు నుంచి నీరుపారే కాలువ కబ్జాకి గురయ్యింది. దీంతో చెరువు దిగువన ఉన్న వరి పొలాలు నీట మునుగుతున్న కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి స్పందించిన తహసీల్దార్ సురేష్, ఇతర రెవెన్యూ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్రమణ నిజమే అని తేల్చి అక్రమణదారు కి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి సిబ్బందితో మాట్లాడారు. వెంటనే కాలువకు అడ్డుగా వేసిన రహదారిని మార్పు చేసి గత మాదిరిగానే కాలువను త్రవ్వి, నీరు పోయే మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఆ తాసిల్దార్ సురేష్ హెచ్చరించారు. దీంతో ఆక్రమణ దారు తను వేరే పని నిమిత్తం ఊరి బయట ఉన్నానని వచ్చిన వెంటనే తొలగింపు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు తాసిల్దార్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ తో పాటు సర్వేయర్ మధు కేశవ్, మండల రెవిన్యూ గ్రామం ఇన్స్పెక్టర్ కిషోర్, గ్రామ రెవెన్యూ అధికారి రామనాయుడు పాల్గొన్నారు. ఐతే దీనిపై రెవెన్యూ యంత్రాగమే కాకుండా పౌర సమాజం కూడా ఎన్నడూ లేని విధంగా స్పందించింది. స్థానిక రైతులు కూడా హాజరై తమ సమస్య వేగంగా పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు.

## బాల్యవివాహాల నిషేదచట్టం పై అవగాహన

విశాలాంధ్ర- మెరక ముడిదాం: మండలంలో గల అంగన్‌వాడీ కార్యకర్తలు ,మహిళా సంరక్షణ కార్యదర్శులతో బాల్యవివాహ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం ఐ.సి.డి.యస్ పర్యవేక్షకులు టి.శ్రీదేవి, జె.లక్ష్మి,యమ్ .నాగమణి ఆద్వర్యంలో జరిగింది. కార్యక్రమ లో పర్యవేక్షకురాలు టి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రతీ అంగన్‌వాడీ కార్యకర్త తమ పరధిలో బాల్యవివాహ నిషేధచట్టం సక్రమంగా అమలయ్యేవిధంగా బాద్యతను తీసుకోవాలన్నారు. అనంతరం ఎన్.జి.ఓ సి.హెచ్ వెంకటనారాయణమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు నిషేద చట్టం లో ఉన్న కమిటీ ల గురించి మరియు బాల్యవివాహాలు జరిపితే విధించే శిక్షల గురించి తెలియజేసారు.వన్ స్టాప్ సెంటర్ బి.నారాయణమ్మ మాట్లాడుతూ స్త్రీలు ఎటువంటి వేధింపులకు గురైన వన్‌స్టాప్ సెంటర్ కు 1098,181 ఫోన్ నెంబర్లు కు పిర్యాదు చేయవచ్చు అన్నారు.ఈ కార్యక్రమం లోబాల్యవివాహాలు నిషేధ చట్టంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఓ వి.వి రమణమూర్తి, డిసిపియు యూనిట్ సభ్యులు అప్పారావు, మహిళా సంరక్షణా కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరద బాధితుల సహాయార్థం రాజాం జర్నలిస్టులు విరాళాల సేకరణ

విశాలాంధ్ర -రాజాం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజాం ప్రెస్‌క్లబ్ సభ్యులు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేస్తున్నారు. జర్నలిస్టు లంతా కలిసి టౌన్ లోని ప్రతీ ఒక్కరి వద్దకు వెళ్లి, విరాళాలు సేకరిస్తున్నారు. వీటిని సిఎం రిలీఫ్ ఫండ్ కు అందజేస్తామని తెలిపారు. ప్రజలు, వ్యాపారుల నుంచి మంచి స్పందన వస్తోంది. జర్నలిస్టులు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందిస్తున్నారు.

# గంజాయి రహిత జిల్లాగా చేయడమే లక్ష్యం

## కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

### ఈ ఏడాది 49 గంజాయి కేసులు నమోదు

### ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర -విజయనగరం: గంజాయి ఉత్పత్తిని, రవాణాను, వినియోగాన్ని అరికట్టి గంజాయి రహిత జిల్లాగా విజయనగరం ను నిలపాలని, అందుకు పోలీస్, ఇతర శాఖలు సమన్వయం తో పనిచేయాలనీ జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. విద్యా సంస్థల్లో యాంటి డ్రగ్ కమిటీ లను వేసి డ్రగ్స్ వినియోగం వలన జరిగే నష్టాల గురించి అవగాహన కలిగించాలని తెలిపారు. అదేవిధంగా బస్సు స్టాండ్ లో, రైల్వే స్టేషన్లలో , కూడళ్ళ లో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కూడా అవగాహన కలిగించాలని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధక జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా ను అరికట్టడానికి ప్రధానంగా రాయగడ, కోరాపుట్, ఎఎస్ఆర్ జిల్లాల రూట్లలో తిరిగే ఆర్‌టిసి డ్రైవర్స్ కు, కండక్టర్లకు గట్టి నిఘా ఉండేలా చూడాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, అటవీశాఖల అధికారులు గంజాయి పంట ఎక్కడైనా వేస్తున్నారేమోనని కన్నేసి ఉంచాలన్నారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా ఉంటె పోలీస్ కు అప్పగించాలని తెలిపారు. జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఇంతవరకు 49 కేసు లను నమోదు చేసి 1109 కేజీ ల గంజాయి ను సీజ్ చేసామని, ఇందుకు సంబంధించి 140మంది ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి సాగులేదని, అయితే సరిహద్దు జిల్లాలైన ఎ.ఎస్.ఆర్, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల నుండి రవాణా జరుగుతోందని తెలిపారు. జిల్లాలో డీ అడిక్షన్ కేంద్రం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని, వెంటనే దానిని పునరుద్ధరించాలని కలెక్టర్ ను కోరారు. జిజిహెచ్ లో 15 బెడ్‌వార్డ్ ఉందని, అయితే సంబంధిత మెడికల్ ఆఫీసర్ 6 నెలల క్రితమే రిసైన్ చేసారని, ప్రస్తుతం ఆ పోస్ట్ ఖాళీ గా ఉందని డి.ఎం.హెచ్ ఓ డా.భాస్కర రావు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే డీ అడిక్షన్ కేంద్రం పని చేయాలనీ, ఏమేం అవసరమో ప్రతిపాదించి ఫైల్ వెంటనే పెట్టాలని ఆదేశించారు. మందుల దుకాణాల్లో వైద్యుల చీటీ లేకుండా అమ్మే మందుల పై డ్రగ్ కంట్రోల్ అధికారి దృష్టి పెట్టాలని, మందుల దుకాణాల్లో మత్తుపదార్థాల అమ్మకాలను అరికట్టాలని ఎస్పి తెలిపారు. విద్య సంస్థలలోనూ, పబ్లిక్ స్థలాల్లో ను అవగాహనా సదస్సులు నిర్వహించాలని అన్నారు. సరిహద్దు జిల్లాల్లో వాహనాల ఆకస్మిక తనిఖీలను నిర్వహించాలను, రైళ్ళ లో, రైల్వే స్టేషన్లలో గట్టి నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి వెంకటేశ్వరరావు, ఉప రవాణా కమీషనర్ మని కుమార్ , ఆర్.డి.ఓ లు సూర్యకళ, శాంతి, సాయిశ్రీ, డిఎస్‌పి లు గోవింద రావు, శ్రీనివాసరావు, జిఎస్‌టి జాయింట్ కమీషనర్, డి.పి.ఓ శ్రీధర్ రాజ, జిల్లా వ్యవసాయ అద్దికారి తారక రామారావు, బాలల సంరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు హిమబిందు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

19

# వరద బాధితుల్ని ఆదుకొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి

## ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

- రెండు లక్షల వాటర్ ప్యాకెట్లను పంపిన జిల్లా యంత్రాంగం
- రెండు ట్రక్కుల్లో జిల్లా కేంద్రం నుంచి తరలింపు
- వాహనాలను ప్రారంభించిన ఎంపి కలిశెట్టి

విశాలాంధ్ర-విజయనగరం: వరద బాధితుల సహాయార్థం జిల్లా నుంచి రెండు లక్షల వాటర్ ప్యాకెట్లతో కూడిన రెండు ట్రక్కులు బుధవారం జిల్లా కేంద్రం నుండి బయలుదేరాయి. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాల మేరకు జిల్లా తరపున గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈ రెండు ట్రక్కులతో వాటర్ ప్యాకెట్లను విజయవాడకు పంపించే ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ కార్యాలయం వద్ద రెండు ట్రక్కులతో సిద్ధంగా వున్న లారీలను పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, ఎస్.పి. వకుల్ జిందాల్ తో కలసి బుధవారం ప్రారంభించారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచనల మేరకు విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఈ ప్యాకెట్లను అందిస్తామని గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్.ఇ. డి.ఉమాశంకర్ చెప్పారు. ఈ సందర్భంగా ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు మాట్లాడుతూ విజయవాడలో ఎన్నడూలేని విధంగా వరదలు సంభవిం చాయని, అక్కడి వరద బాధితులను ఆదుకొనేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సహాయం అందించాలని కోరారు. జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు వరద బాధితులకు రూ.10 లక్షలు సహాయంగా ప్రకటించారని, జిల్లాలోని అన్ని వర్గాల వారు తమ వంతుగా సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, గ్రామీణ నీటిసరఫరా ఎస్.ఇ. డి.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ కవచ్ పికెట్ ను తనిఖీ చేసిన కోస్టల్ సెక్యూరిటీ ఏఎస్పి మధుసూదన రావు

విశాలాంధ్ర-భోగాపురం: తీరప్రాంతాల్లో ఉగ్రవాదులపై దృష్టి సారించడం వారిని ఎదుర్కొనే అంశాలపై అవగాహన నిమిత్తం తీర ప్రాంతానికి ఆనుకొని ఉన్న భోగాపురం, పూసపాటి రేగ మండలాల్లో రెండు రోజులపాటు ఏర్పాటుచేసిన సాగర్ కవచ్ ను గురువారం సాయంత్రం కోస్టల్ సెక్యూరిటీ ఏ ఎస్ పి మధుసూదన రావు తనిఖీ చేశారు. తీర ప్రాంత గ్రామాల నుంచి రాకపోకలు చేస్తున్న అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ వైకుంఠరావు, ఐ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పోషకాహార వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర-గజపతినగరం : పోషణ పక్వాడ మహోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని జిన్నాం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం 2 లో పోషకాహార మా సోస్తవాల్లో గర్భిణీలు బాలింతలు తల్లులకు కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి గజపతినగరం అంగన్వాడి సిడిపిఓ నాగమణి హాజరై ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం విలువలు ఉండే ఆహార పదార్థాలు గూర్చి వివరించారు అలాగే చిరుధాన్యాలు ఐరన్ క్యాల్షియం వాటిని వినియోగించాలని అందరూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు అంగన్వాడి ద్వారా ఇచ్చిన పదార్థాలు వాడమని తెలిపారు ఈ కార్యక్రమం ఎస్ లింగాలవలస సెక్టార్ పరిధిలోని కార్యక్రమం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో జి కళావతి సర్పంచ్ సూపర్వైజర్ శకుంతలమ్మ ఏఎస్ఎం తల్లులు అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసరాల ధరలు తగ్గించాలి : సీపీఐ

విశాలాంధ్ర-నెల్లిమర్ల : పెరిగిన నిత్యావసర ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ మండల నాయకులు మొయిద పాపారావు డిమాండ్ చేశారు. మండలంలోని కొండగుంపాంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అయన మాట్లాడుతూ నిత్వవసర సరుకుల ధరలు తగ్గించి ప్రజా పంపిణీ వ్యవస్థని పటిష్టపరిచి అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయాలని కోరారు. మోది ప్రభుత్వం గద్దినెక్కిన తర్వాత నిత్యావసర ధరలు అదుపు లేకుండా పోయావని అన్నారు. వరద బాధితలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలిపల్లి సూరి, మొయిద తవిటి నాయుడు, లెంక సత్యం, మజ్జి రామస్వామి, లెంక రామునాయుడు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :రానున్న వినాయక చవితి ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతుల పొందాలని ఒకటో పట్టణ సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండగకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగల్ విండో విధానానికి సంబంధించిన అనుమతులు తప్పనిసరిగా ఉత్సవాలకు సంబంధించిన కమిటీ సభ్యుల వద్ద ఉండాలన్నారు. అలాగే సంబంధిత వినాయక బొమ్మని నిలబెట్టిన మండపాలలో తప్పనిసరిగా ఒకరు లేదా ఇద్దరు సభ్యులు 24 గంటలు ఉండేలా చూసుకోవాలన్నారు. డిజే బాక్స్ లో బాణసంచా వినియోగం నిషిద్ధమన్నారు. నిమజ్జనం సమయంలో రంగులు జల్లుకోవడం తదితర చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే తప్పనిసరిగా కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా రాత్రి 11 దాటిన తర్వాత అవసరమైతే తప్ప ఎవరూ బయటికి రావదన్నారు. వినాయక చవితి పండుగకు సంబంధించి ప్రజలందరూ తమకు సహకరించాలని కోరారు.

## గురువుల్ని సన్మానించిన పూర్వ విద్యార్థులు

### భావోద్వేగాలకు గురైన అధ్యాపకులు

విశాలాంధ్ర - పూసపాటి రేగ: పాతిక సంవత్సరాల తర్వాత తమకు విద్యనేర్పిన పాఠశాల ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. గోవిందపురం హైస్కూల్లో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. 1994 నుండి 1999 వరకు హైస్కూల్లో విద్యాభ్యాసం చేసి ఉన్నత విద్యలో రాణించి వేరువేరు దేశాలలో వేరువేరు ఉద్యోగాలలో స్థిరపడిన విద్యార్థులందరూ స్కూల్ విడిచి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కలుసుకొని అప్పుడు విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువులకు పాదాలు కడిగి తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ తాము ఉద్యోగం కోసం చేసినప్పటికీ ఇలాంటి సందర్భంలోనే నిజమైన గురువుగా గర్వపడుతున్నామని ఉద్వేగ భరితమైన ప్రసంగాలు చేస్తూ పూర్వవిద్యార్థులను మరిన్ని అత్యున్నతశిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు హైస్కూల్ సిబ్బంది, ప్రస్తుత విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సొంత భూమి కోసం న్యాయ పోరాటం

### తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బాధితులు

### రెండు రోజుల వ్యవదిలో అప్పగిస్తామని రెవెన్యూ, పోలీసుల హామీ

విశాలాంధ్ర-జామి: తమ వారసత్వంగా వచ్చిన భూమిని కొందరు ఆక్రమించారని, కాపాడాలని ఓ బాధిత కుటుంబం రెవెన్యూ, పోలీసుల చుట్టూ తిరుగుతున్న వైనం జామిలో జరిగింది. అన్ని ఆధారాలు ఉన్నా ఆర్‌డివో, జెసి కోర్టులలో తమకు అనుకూలంగా తీర్పులు వచ్చినా కనీసం రెవెన్యూ అధికారులు పట్టించు కోవడం లేదని ఈకుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి విసిగి పోయి బుధవారం కార్యాలయం ఎదుట కుటుంబంతోపాటు భైఠాయించారు. తమ సమస్య పరిష్కరించే వరకు ఇక్కడనుంచి లేచేది లేదని భీష్మించారు. వివరాల్లోకి వెళితే మండలంలోని గొడుకొమ్ము రెవెన్యూలో సర్వేనెం.49, 52లలో నమ్మి అన్నపూర్ణ కుటుంబానికి సంభందించి కొంత భూమి వుంది. వారసత్వంగా అందులో కొంత భూమి అన్నపూర్ణకు చెందినది. కానీ గతంలో ఇదే ప్రాంతంలో వీళ్ళ కుటుంబానికి చెందిన ఇతర వాటాదారుల వద్ద కొనుగోలు చేసిన ఓ స్థానిక వ్యక్తి వీరి భూములను సైతం ఆక్రమించి సాగు చేస్తున్నారు. విశాఖలో స్థిరనివాసం ఉంటున్న అన్నపూర్ణ కుటుంబసభ్యులు అనేక ఏళ్ళగా భూపోరాటం చేస్తున్నారు. వీరి పోరాట ఫలితంగా ఆర్‌డివో కోర్టులోనూ, జాయింట్ కలెక్టర్ కోర్టులోనూ వీరికి అనుకూలంగా తీర్పులు వచ్చాయి. కానీ భూమి మీదకు వస్తే సదరు ఆక్రమణ దారుడు దాడులు చేస్తున్నాడు. దీంతో వీరు స్థానిక రెవెన్యూ అధికారులను, పోలీసులను ఆశ్రయించడం జరుగుతోంది. ఎన్ని సార్లు తిరిగినా ఉపయో దం లేకపోవడంతో బుధవారం కార్యాలయం ఎదుట నమ్మి అన్నపూర్ణ తన కుమారుడు, కోడలు, కుటుంబసభ్యులతోపాటు భైఠాయించారు. తమ భూమిని తమకు అప్పగించాలని డిమాండ్ చేసారు.

### ఎట్టకేలకు చర్చలు సఫలం..

ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులతో తహశీల్దార్ కృష్ణలత, జామి ఎస్ఐ వీరబాబులు చర్చించారు. అధికారికంగా మంజూరు చేసిన వన్‌బిలో నమోదు మేరకు సర్వేనెం.49లోని భూమిని శుక్రవారం రెవెన్యూ, పోలీసుల సమక్షంలో అప్పగిస్తామని, మిగిలిన భూమిపై కోర్టు తగాదా ఉన్నందున పరిష్కారం కాగానే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో బాధిత కుటుంబం అందుకు అంగీకరించారు. శుక్రవారం తకు వన్‌బిలో ఉన్న భూమిని సరిహద్దులతో తమకు అప్పగించాలని కోరారు. దీంతో కథ తాత్కాలికంగా సుఖాంతమయింది.

## నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై సీపీఐ నిరసన

విశాలాంధ్ర-ఎస్.కోట : పెరుగుతున్న ధరలను నియంత్రించాలంటూ సీపీఐ పిలుపుమేరకు బుధవారం ఉదయం పాత బస్టాండ్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో అరుణకుమారి కి ధరల నియంత్రణపై వినతిపత్రాన్ని అందించారు ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేగల అప్పలరాజు మాట్లాడుతూ తన సమాజంలో ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో నిత్యవసరాలు కొనుగోలు చేయడానికి యుద్ధమే చేపడుతున్నాడు మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు విపరీతంగా పెరిగాయని గ్యాస్ పప్పులు పెట్రోలు వంటి ప్రజా నిత్యవసర వస్తువులు మానవుడు కొనలేకపోతున్నాడు అని తెలియజేశారు ఇప్పటికైనా రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేగల అప్పలరాజు తో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందిపల్లి భీముడు కార్యకర్తలు శ్రీను రాంబాబు అప్పలనాయుడు రామకృష్ణ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రామలింగాపురం రహదారికి మోక్షం లేదా....?

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి మండలంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన రహదారి నరకాన్ని తలపిస్తున్నప్పటికీ సంబంధిత పాలకులు గానీ అధికారులు కానీ పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు... ప్రత్యేకించి చీపురుపల్లి మండల పరిషత్ అధ్యక్ష పదవిలో కొనసాగుతున్న ఎంపీపీ సొంత గ్రామానికి ఏర్పాటైన ఈ రహదారి గతుకులమయం కావడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఈ రహదారిలో ఇటీవల కాలంలోనే ఉత్తరాంధ్రాకు ప్రసిద్ధిగాంచిన శ్రీ మానసా దేవి ఆలయం ఉండడంతో భక్తులతో నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ప్రతి మంగళవారం శుక్రవారం మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండడంతో భక్తులు తాకిడి ఎక్కువగా ఉంటూ రహదారి వినియోగించుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి గతుకులమయం కావడంతో వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులతో పాటు కాలిబాటన నడుస్తున్న ప్రయాణికులు సైతం గతుకుల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. గతుకులలో దిగిన వాహనాలు బోల్తాపడే ప్రమాదం ఉందంటూ వాహన శోధకులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి ప్రధాన కేంద్రం నుండి పుర్రెయ్యవలస రామలింగాపురం విశ్వనాధపురం మీదుగా మెట్టపల్లి కేంద్రానికి చేరుకోవడానికి ఈ లింకు రహదారిని కూడా ఉపయోగించుకుంటున్నారు. గతుకుల మయమైన రహదారి పైన అధికారులు పాలకులు దృష్టి సారించి రహదారి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుకుంటున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా జానకిరావు



విశాలాంధ్ర.రాజాం/సంతకవిటి: విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సిరిపురం ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ బొత్స జానకిరావు మండల పరిషత్ ప్రాధమిక పాఠశాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు గా ఎంపిక అయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయుడు జానకిరావు కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థులు, సంతకవిటి మండలం ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలియజేశారు.

## రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి...

విశాలాంధ్ర-బాడంగి: మండలంలో మండలంలో రైతులంతా రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువుల అధిక వినియోగించాలని వినియోగించాలని వ్యవసాయ అధికారి వ్యవసాయ అధికారి శిరీష కోరారు .ముగడ గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు.ప్రస్తుతం వరి పంటలో ఎరువులు, చీడపీడలు యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు తగ్గించి ప్రత్యమ్నయంగా జీవామృతం వాడాలని తెలిపారు. రాబోయే మూడు రోజుల్లో తుఫాన్ హేచ్చరికలు ఉన్నందున రైతులు అప్రమత్తం గా ఉండాలని, వర్షపు నీరు బయటకు పోయే మార్గాలు చేసుకోవాలని,తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున గట్ల మీద కలుపు గడ్డి లేకుండా చేసి గట్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ఈ పంట నమోదుకి ఈ నెల 15వ తేదీ ఆఖరి కాబట్టి ప్రతి రైతు తప్పనిసరిగా సాగు చేయు పంటలు వివరాలుతో ఆర్‌బికెసిబ్బంది వద్ద పంటలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిఎస్ ప్రసాద్, సాయికుమార్, రైతులజట్టు నుండి ఈశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

## ఇన్స్పైర్ మనక్ ప్రాజెక్టుల నమోదుకు వాల్ పోస్టర్ ఆవిష్కరణ

### జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్

విశాలాంధ్ర-విజయనగరం: ఇన్స్పైర్ మనక్ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో గల అన్ని యాజమాన్యాల పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలు మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులు చొప్పున ఆన్లైన్లో నమోదు చేయాలి. భారత శాస్త్ర సాంకేతిక విభాగం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ,పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమం.విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు వెలికి తీయుటకు, సామాజిక సమస్యలకు పరిష్కారాలు సూచించుటకు, నూతన ఆలోచనలతో ప్రాజెక్టు రూపకల్పన చేయుటకు విద్యార్థులను ప్రోత్సహించాలి. ఎన్నిక కాబడిన ప్రతి ప్రాజెక్టుకు పదివేలలు బహుమతిగా మంజూరు చేయబడును.ఉపాధ్యాయులు అందరూ ఇన్స్పైర్ ప్రాజెక్టులను నమోదు చేయవలసిందిగా కారడమైనది.నేటి వరకు జిల్లాలో గల 200 పాఠశాలల నుంచి 850 ప్రాజెక్టులు నమోదు చేయడం జరిగినది. ప్రాజెక్టుల నమోదుకు చివరి తేదీ ఈ నెల 15 . చివరి వరకు వేచి ఉండగా ఉపాధ్యాయులు త్వరపడవలసిందిగా కోరడమైనది. ఈ పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నవారు యం.కృష్ణారావు,జిల్లా సైన్స్ అధికారి. ఎన్‌టి నాయుడు, ప్రిన్సిపల్, డైట్ కళాశాల, శేఖర్ ఏ. ఎస్. ఓ. శ్రీనివాస్, ఏడి, సుపరెండెంట్లు, సమగ్ర శిక్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీతం కళాశాలలో యన్ సి సి బాలికల ఎంపిక



విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో 2ఏ గర్ల్స్ బెటాలియన్, యన్‌సిసి, ఆధ్వర్యంలో బాలికల ఎన్సిసి ఎన్రోల్మెంట్ సెలక్షన్ జరిగాయి. ఈ సెలక్షన్‌లో భాగంగానే 500 మీటర్ల రన్నింగ్, కళ్ళ నిర్ధారణ పరీక్ష, చేతుల కాళ్ళ కదలికల పరీక్ష ,బాడీ మాస్ ఇండెక్స్, రాత పరీక్ష ,వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఆధారంగా ఎంపిక చేయటం జరిగింది. ఈ సెలక్షన్‌లో సీతం కళాశాల నుంచి 150, సత్య అండ్ పీజీ కళాశాల నుంచి 100 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ సెలక్షన్స్‌లో భాగంగా సీతం డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి,డాక్టర్ సాయిదేవమని, కెప్టెన్ ఎం.సత్యవేని, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, సిఎస్ఓ సత్యనారాయణ, పిడి మహేశ్వరరావు, 2 ఏ గర్ల్స్ స్టాఫ్, యన్‌సిసి కేడెట్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మంచంపడ్డ వారిని పరామర్శించిన ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-తెర్లాం: ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) బుధవారం తెర్లాం మండలంలో పలు గ్రామాలను పరిశీలించారు. ఆమిటి గ్రామంలో కరణం రమేష్ నాయుడు తల్లి కి బాగోలేదని తెలుసుకొని వారిని పరామర్శించారు ఉద్దవోలు గ్రామంలో ఎమ్‌పిటిసి మరడానా చిన్నమికి బాగోలేదని తెలుసుకుని వారిని పరామర్శిం చారు. నెమలం గ్రామంలో పశువుల ఆసుపత్రి బాగోలేదని గ్రామపెద్దలు, అక్కడ వైద్యాధికారి తెలియజేయడం జరిగింది, దాని పరిశీలించి వెంటనే పిఆర్ ఏఈ కి ఫోన్ చేసి గురువారం వచ్చి చూసి కొత్త బిల్డింగ్ కి ఎస్టిమేట్ తయారుచేయమని చెప్పారు. అదేగ్రామంలో ప్రాథమిక పాఠ శాల ఉపాధ్యాయులు వేగిరెడ్డి అప్పలనాయుడు మాస్టారు రిటైర్మెంట్ సన్మాన కార్య క్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు మండల నాయకులు నర్సిపల్లి వెంకట నాయుడు, నర్సిపల్లి వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపించే వెలుగే గురువు

విశాలాంధ్ర-రాజాం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కోరుకున్నట్టు, ఒక దేశం బాగుండాలి అంటే ఆదేశంలో అన్ని వ్యవస్థలు బాగుండాలి, అన్ని వ్యవస్థలు బాగుండాలి అంటే అందరూ పౌరులు విలువలతో బ్రతకాలి, ప్రతీ పౌరుడు విలువలతో బ్రతకాలి అంటే బాల్యంలో విద్యార్థి దశలోనే గురువు విలువలతో కూడిన విద్యను అందించాలి, అప్పుడే ప్రతీ విద్యార్థి వృద్ధిలోకి వచ్చి ప్రతీ వ్యవస్థను సన్మార్గంలో నడిపిస్తూ, ఎటువంటి చెడు సంఘటనలు జరగనివ్వకుండా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలరు. కాబట్టి ప్రతీ పౌరుడు, ప్రతీ వ్యవస్థ బాగుండాలి అంటే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కోరుకున్నట్టు ప్రతీ గురువు నిరంతరం జ్ఞానాన్ని సముపార్జన చేసి, తాను ఆచరిస్తూ విద్యార్థులకు బోధిస్తూ సమాజాన్ని సరైన క్రమంలో పెట్టాలని, ప్రతీ ఉపాధ్యాయుడు అత్యుత్తమ గురువుగా జీవించాలని, మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ ఆకాంక్షించారు.

## జెడ్పీ చైర్మన్ పుట్టినరోజు సందర్భంగా నేడు రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా గురువారం సోమలింగా పురం గ్రామములో ఉన్న సాయిరాం గుడి దగ్గర మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావు, మండల సీనియర్ నాయకులు తాడ్డే వేణుగోపాలరావు, సిరువురి వెంకటరమణ రాజు, బూర్లె నరేష్ కుమార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 1:00 వరకు ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో వైయస్సార్ పార్టీ కార్యకర్తలు అంతా రక్తదానం చేయటంతో పాటు తమ ప్రక్క వారిని ప్రోత్సహించి రక్తదానం ద్వారా మరొకరికి ప్రాణదాతలు కావాలని విజ్ఞప్తి చేశారు.

## మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సెప్టెంబరు 7న జరగబోయే వినాయక చవితి పండగకుమదర్ తెరిసా సేవా సంఘం & బ్లడ్ డోనర్స్ క్లబ్ &మదర్ తెరిసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా ప్రతి సంవత్సరం వలె బుధవారం పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రంగులను ఉపయోగించే వినాయకుడి విగ్రహాలను ఉపయోగించకుండా, పర్యా వరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతో, 300 మట్టి విగ్రహాలను పట్టణంలో అయ్యన్నపేట జంక్షన్‌లో మదర్ తెరిసా కిడ్స్ స్కూల్ తల్లిదండ్రులకు, సాయి కృష్ణ వాకర్స్ క్లబ్ సభ్యులకు, అయ్యన్నపేట జంక్షన్ ప్రాంత వాసులకు ప్ సంఘ అధ్యక్షులు- త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు త్యాడవేణుగోపాలం, సభ్యులు శ్రావణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పలు పంచాయతీలలో పౌష్టికాహారం మహోత్సవాలు

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని పెద్ద తాడివాడ జొన్నాడ ఆర్ ముంగినపల్లి ఢీకొల్లం చొల్లంగిపేట పంచాయతీలలో పౌష్టికాహార మహెూత్సవాలు బుధవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి సిడిపిఓ ఎస్తేరు రాణి తుమ్మి లక్ష్మీరాజ్ హాజరైనారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు గర్భిణీలు బాలింతలు మహిళల్లో రక్తహీనత లేకుండా ఉండాలంటే ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలని చిన్న పిల్లల నుండి వృద్ధులవరకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు అనంతరం గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు కోరాడ రమణి ఎంపీటీసీ త్రిపురగిరి దేవి కోరాడ కనకరాజు ఎంపీటీసీ లు అంగన్వాడి సిబ్బంది ఏ సత్యవతి స్వామి (మాస్టారు) అంగన్వాడీ టీచర్లు తల్లులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు విశాఖపట్నం మారికవలస వద్దనున్న శ్రీ గాయత్రీ మెడికల్ కాలేజీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ వి అచ్యుతరామయ్య ఆదేశాల మేరకు బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని మేనేజర్ మురళీ కృష్ణమోహన్ తెలిపారు. ఈ ఉచిత మేఘ వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని మేనేజర్ తెలిపారు కంటి వ్యాధితో బాధపడుతున్న ఇద్దరుకు మారికవలస లో ఉన్న గాయత్రీ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి శస్త్ర చికిత్స నిమిత్తం పంపి రిఫరల్ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన ప్రిన్సిపాల్ సంఘం వెంకటరమణ, కరస్పాండెంట్ , ఎస్ హారిక కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ మోహన్ రవు, డాక్టర్ అంజి బబు, వైద్య సిబ్బంది శ్రీ లలితా దేవ, మౌనిక, భవాని, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం తోనే పర్యావరణ పరిరక్షణ..

విశాలాంధ్ర-రాజాం: పచ్చదనం తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని రాజాం టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ నాయుడు అన్నారు. డోలపేట హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు నేతృత్వంలో గత కొన్ని నెలలు నుంచి పొనుగుటివలస-బొద్దూరు రోడ్డులో ప్రధాన రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విరివిగా చేపడుతున్నారు . ఈ సందర్భంగా బుధవారం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమం లో రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి తన జీవితంలో ఒక మొక్క నాటి,దానిని నిత్యం సంరక్షించి, చెట్టుగా మలిస్తే, పర్యావరణానికి ఎటువంటి ప్రమాదం ఉండదని తెలిపారు. పిల్లలని పెంచినట్టే చెట్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో శాసపు అప్పలనాయుడు,సాసపు నాయుడు,లావేటి శ్రీను,చీర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
రక్త దానం చేయండి-ప్రాణదాతలు కండి

## రాజాం వాసవి క్లబ్ వనితాశక్తి అద్వర్యంలో జిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-రాజాం: రక్త దానం చేయండి-ప్రాణ దాతలు కండి అని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి అన్నారు. బుధవారం జిఎన్ఆర్ డిగ్రీ కళాశాల లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని అయన ప్రారంభించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ద్వార అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో బాగంగా ఈ రోజు రెడ్ క్రాస్ సహకారం తో రక్తదాన శిభిరాన్ని నిర్వహించామని అయన అన్నారు. రాజాం రెడ్ క్రస్ చైర్మెన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్ మాటలాడుతూ ప్లాట్ లెట్స్ తగ్గి అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని ఇట్లాంటి సమయములో పెద్ద ఎత్తున యువత రక్తదానానికి ముందు కు రావటం ఏంతో గర్వించదగా విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వనితా శక్తి అధ్యక్షురాలు పొట్ట శ్రీదేవి, పొట్ట ఈశ్వరరావు, రాపాక కన్యాకుమారి, వద్దాది లక్ష్మి, కొల్లూరు అరుణ, జిఎన్ఆర్ డిగ్రీ కళాశాల చైర్మెన్ పొగిరి రోజా రమణి, డైరెక్టర్ ధర్మపురి విజయ్ కుమార్, ప్రిన్సిపాల్ కొమరిపురి గోవింద ,బుగత రాంబాబు, బెవర శివ, తుమ్మి మురళి, రెడ్ క్రాస్ ప్రతినిధులు నంది ఉమా శంకర్, సుజాత, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. నేత్ర దానం పక్షోక్షవాళ బాగంగా నేత్రదానంపై అవగాయన కల్పించారు. రక్త దానం చేసిన రక్తదాతలకు రెడ్ క్రాస్ తరఫున ప్రశంస పత్రాలు అందజేసారు.

## వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

### సీఐ శంకర్రావు

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఈనెల 7 నుండి గ్రామాల వారీగా ఏర్పాటు చేస్తున్న శ్రీ సిద్ధి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకర్రావు కోరారు. బుధవారం నాడు చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న కమిటీలు ఊరేగింపులకు సంబంధించి అదేవిధంగా బాణా సంచాల కాల్పులకు సంబంధించి కూడా అనుమతులు తీసుకోవాలన్నారు. పబ్లిక్ ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేకించి ఉత్సవ విగ్రహాల వద్ద ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కనెక్షన్లు కూడా అనుమతులు తీసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది మొబైల్ పార్టీల ద్వారా ఎప్పటికప్పుడు ఉత్సవ విగ్రహాలు ఉన్న ప్రాంతంలో పర్యటన చేస్తారన్నారు. మండపాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కమిటీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సర్కిల్ పరిధిలో స్టేషన్ వారిగా అనుమతులు తీసుకోవాలని కోరారు.

## ఉత్సవ ఊరేగింపులకు మేము సిద్ధం

### చీపురుపల్లిలో కొలువైన వినాయక విగ్రహాలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఈనెల 7 నుండి గ్రామాల వారీగా పట్టణాల వారీగా నిర్వహించనున్న శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి మహెూత్సవాలకు ఊరోగింపులతో పాటు మండపాల్లో దర్శనానికి తాము సిద్ధంగా ఉన్నామంటూ చీపురుపల్లిలో తయారవుతున్న వినాయక విగ్రహాలు ప్రయాణానికి సిద్ధపడ్డాయి. చీపురుపల్లి కేంద్రంగా తయారవుతున్న వివిధ రూపాల గణనాథులు కొలువై ఉన్నారు. ప్రతి ఏడాది 200 వివిధ రకాలు గణనాధుని విగ్రహాలు తయారుచేసి చీపురుపల్లి నియోజకవర్గ ప్రధాన కేంద్రంతో పాటు పాలకొండ రాజా శ్రీకాకుళం హిరమండలం బొబ్బిలి బలిజిపేట తదితర ప్రాంతాల నుండి భక్తుల ఆర్డర్లవారీగా విగ్రహణం తయారు చేస్తున్నట్లు తయారీదారుడు శతగోపం శ్రీను వివరించారు. వినాయక విగ్రహాల తయారీతో ఏడాదిలో ఒకసారి దేవుని కృప వలన విగ్రహాలను తయారు చేసి తనతో పాటు మరో 20 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సీజన్ తర్వాత ఎన్ని బొమ్మలు తయారుచేసిన భుక్తికోసం మళ్లీ బ్రతుకు వేట కొనసాగించాల్సిందేనని అన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో పర్యావరణ రక్షణకు మట్టి విగ్రహాలను వాడ వలసిన ఆవశ్యకత పై న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మరియు జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి లాంఛణంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, పాదరసం, సీసం, రసాయనాల రంగులు, థర్మాకోల్ వంటివి వాడి తయారుచేసిన వినాయక విగ్రహాల వలన జలవనరులు కాలుష్యమవుతున్నాయి. సెకండ్ క్లాస్ ప్రత్యేక న్యాయమూర్తి గండి. అప్పల నాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బి.సత్యన్నారాయణ, కోశాధికారి బి.త్రిమూర్తులు, జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ, కోర్టు సూపరింటెండెంట్ ఉపేంద్ర, కె.శ్రీనివాసరావు, న్యాయవాదులు, పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరంలో బుధవారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్లో సహాయస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని విగ్రహాలు ఉచితంగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె లక్ష్మణరావు విచ్చేసి ప్రజలకు మట్టి వినాయకుని ప్రతిమలను అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా అందరూ మట్టి వినాయకుడిని పూజించమని కోరారు ఈ కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్ సాయి రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న...

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: అన్ని దానాలకన్నా అన్నదానం మహా మిన్న అని, అటువంటి అన్నదానాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్న శ్రీ గౌరీ సేవా సంఘం సభ్యులు అభినందనీయులని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి అన్నారు. బుధవారం ఎన్.సి.ఎస్.జంక్షన్ వద్ద శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పేదలకు ఆహారాన్ని అందించారు. అలాగే పలువురికి వినాయక మట్టి ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్న పేదవారికి పట్టెడు అన్నం పెట్టడమే మహాభాగ్యంగా స్వీకరించాలని అన్నారు. సంఘం అధ్యక్షులు కాండ్రేగుల శేఖర్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిత్య అన్నదాన కార్యక్రమం నేటికీ 1,035వ రోజుకు చేరిందన్నారు. కాలం చేసిన వారి సమయంలో అంతిమ రథాన్ని కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే అనేక సందర్భాలలో కంటి పరీక్షలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముల్లేటి చిన్నారావు, మహిళా అధ్యక్షురాలు కనిశెట్టి అమ్మాణి, కార్యదర్శి పొలవర శెట్టి రూపాదేవి పాల్గొన్నారు.

## ఉచిత సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-వంగర: మండలంలో కొప్పరవలస గ్రామంలో ఐదుగురు పేదలకు ఉచిత సరుకులు పంపిణీ చేశారు.బుధవారం నాడు కొప్పర వలస గ్రామానికిచెందిన శ్రీ సత్యసాయి సేవా సమితి ద్వారా ప్రతీ నెల 5గురు కి అమృత కలశంపథకంద్వారా దివ్యాంగులుకు, వృద్ధులకు నెలకు సరిపడే నిత్యవసర సరుకులు 10కిలోల బియ్యం,1కేజీ కందిపప్పు, 1లీటర్ మంచి నూనె,కేజీ బంగాళాదుంపలు, కారంపెకెట్ పసుపు,టూత్ పేస్ట్, సబ్బు, మొదలగు నిత్య అవసరవస్తువులను సేవాదళ్సభ్యుడు సాదెం వెంకటరమణ అందజేశారు. ఈ కార్యక్రమం లో సేవాదళ్ సభ్యులు సాదెం వెంకటరమణ, బొత్స గణపతి రావు సొంగ అప్పలన రసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయి వ్యవసాయ సహాయకులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలం రైతు సేవ కేంద్రంలో ఐదు మండలాల వీఏఏస్ ఏ ఈ ఓ ఎస్ లకు విజయనగరం జిల్లా డిఆర్సి భారతి పంటలలో ఆశించు చీడ పీడలు గురించి వివరించి వాటిని నివారణ చేయుట కొరకు సిఎల్ఎస్ మరియు పిడిఎస్ఎస్ అనే యాప్ రూపొందించారని వివరించారు ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా వ్యవసాయ అధికారి వీటి రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు రైతు సేవ కేంద్రం ఇన్చార్జులు సకాలంలో ఈ పంట పూర్తి చేయవలెనని ఎరువులు పంపిణీ గురించి వారికి ఆదేశాలు జారీ చేశారు ఏ పి ఎమ్ ఐ పి డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్రిప్ మరియు స్పింకర్స్ పొందిన రైతులు వివరాలు ఈ పోర్టల్ లో నమోదు గురించి వివరించి బోర్లు ఉన్న రైతులకు ఏపీఎంఐపి రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించడం అయినది ఈ కార్యక్రమంలో ఏపీసిఎన్ఎఫ్ ఆనందరావు మాట్లాడుతూ ఈ పంట నమోదు జరిగినప్పుడు పకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను నమోదు చేయమని తెలపడం జరిగింది అలాగే జీవామృతం తయారీ దాని ఉపయోగాలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ అధికారులు మరియు హార్టికల్చర్ ఆఫీసర్లు పాల్గొన్నారు

## ఈఓపిఆర్డి నీలిమ సిబ్బందితో గ్రామ సందర్శన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో బుధవారం ఈఓపిఆర్డి నీలిమ సిబ్బంది తో ఉద్దవోలు గ్రామ పంచాయతీ పరిధిలో గల యు.గదబవలస విలేజ్ ను సందర్శించి గ్రామ ప్రజలకు ఏమి అవసరమో వాళ్ళ నుంచి అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భం లో స్కూల్ బిల్డింగ్ చాలా అధ్వానముగా గోడలు పగిలి స్లాబు కూడా ఒక వైపు క్రుంగినట్లుగా ఉంది. ప్రభుత్వం చాలా త్వరగా స్పందించాలని ఈఓపిఆర్డి నీలిమ ని ప్రజలు వేడుకుంటున్నారు అని, విద్యార్థులకు విద్య నేర్చుకునేందుకు నాన్యమయినా స్కూల్ బిల్డింగ్ లేక ఇందులోనే బిక్కుబిక్కుమంటూ చదువుతున్నారు అని అన్నారు.త్వరతగతిగా ఈ గ్రామం పై దృష్టి పెట్టి విద్యార్థులకు ఏమి కావాలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు.అక్కడ గ్రామ ప్రజలు, సర్పంచ్ ఎచ్చర్ల సునీత, వైస్ సర్పంచ్ టి.వెంకటరమణ, సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఆమె తో పాటు పాల్గొన్నారు అని విలేకర్ తో స్థానిక సర్పంచ్ ఎచర్ల.సునీత తెలిపారు.

## వినూత్నంగా జెడ్పీ చైర్మన్ కు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్, వైఎస్ఆర్సీపీ జిల్లాఅధ్యక్షుడు, ఉత్తంధ్ర డెప్యూటీ కో-ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) జన్మదిన శుభాకాంక్షలను వినూత్నంగా తెలుపుతూ తన అభిమానాన్ని శ్రీకాకుళం జిల్లా యువకుడు యర్ల మహేష్ చాటుకున్నాడు. ఈ నెల 5న మజ్జి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా, వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. స్కూబా డ్రైవ్ తో గర్భం లోపలికి వెళ్లి అభిమాని నాయకుడి చిత్రపటాన్ని చూపిస్తూ పుట్టిన రోజు శుభకాంక్షలు తెలియజేస్తూ తన అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నాడు.

## వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సమాజాన్ని తీర్చి దిద్దే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రా దేవి పేర్కొన్నారు. పట్టణంలోని గురజాడ అప్పారావు స్వగృహంలో వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కుసుమంచి శ్రీదేవి, చల్లపల్లి శ్యామల ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ సుభద్రాదేవి మాట్లాడుతూ సమాజానికి అవసరమైన డాక్టర్, ఇంజనీర్, న్యాయవాది, రచయిత, ఇలా అందరినీ తయారు చేసేది ఉపాధ్యాయుడేనని పేర్కొన్నారు. అనంతరం సత్కార గ్రహీతలు ప్రసంగించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత గురజాడ అప్పారావు స్వగృహంలో తమకు సత్కారం జరగడం అదృష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గురజాడ ఇందిర, సత్యలత, గీతారాణి, శ్రేయ, క్లబ్ సలహాదారు పప్పు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా భారీర్యాలీ

విశాలాంధ్ర-గరివిడి: గరివిడి మండలం మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా గరివిడి మండలంలో ఉన్న మాలమహానాడు కార్యకర్తలు అందరు కలిసి ఏక దాటిగా భారీరాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గరివిడి మండలం మాలమహానాడు అధ్యక్షులు టొంపల. సంజీవరావు గౌరవ అధ్యక్షులు పేకెటి చంద్రరావు గంటాన. అప్పారావు ఉపాధ్యక్షులు బూర. సూర్యనారాయణ ప్రధాన కార్యదర్శి బి. పోలీస్ గోట్నంది.సర్పంచ్ లోపింటి. రాంబాబు మరియు మండలం లో ఉన్న మాల మహిళా కార్యకర్తలు మాల ఉపధ్యాయులు ఉద్యగా సంఘాలు పాల్గొన్నారు.

## కబ్జాలకు పాల్పడ్డా పట్టించుకోరా ?





**ఆర్డీఓ ఆఫీస్ కి వెళ్తున్న రహదారి నీ ఆక్రమించుకుంటున్న కబ్జాదారులు**

**నిత్యం అదే రహదారి మీదుగా ప్రయాణిస్తున్న ఆర్డీవో**

**కలెక్టర్ కి, ఆర్డిఓ కి, తాసిల్దార్ కి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోని వైనం**

**అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు సమాయత్తమవుతున్న కబ్జాదారులు**



విశాలాంధ్ర-చీపురుపల్లి: కబ్జాదారులకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. ఆర్డీవో కార్యాలయానికి వెళ్ళే రహదారిని సైతం ఆక్రమించుకుంటున్నా చర్యలు తీసుకోవడంలో తాత్సారం వెనుక పలు అనుమానాలకు తావిస్తుంది. ఇదంతా జరుగుతుంది ఎక్కడో కాదు, శాసనసభ్యులుగా కిమిడి కళా వెంకట్రావు ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో జరుగుతున్న అక్రమ భూదందా కి ఇది నిదర్శనం. జిల్లా రెవెన్యూ కార్యాలయ అధికారి సాక్షాత్తు రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంకి నిత్యం రాకపోకలు సాగుతున్న ప్రధాన రహదారి ఆక్రమణలకు గురవుతున్న వైనం. చీపురుపల్లి రెవెన్యూ కార్యాలయం తో పాటు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆదర్శ డిగ్రీ కళాశాల ఉన్నత పాఠశాలతో పాటు ఇండోర్ స్టేడియం నిర్మాణం కొరకు కేటాయించిన స్థలాలకు అవసరమైన ప్రధాన రహదారి చీపురు పల్లి అగ్నిమాపక శాఖ కార్యాలయం పక్క నుండి నిర్మించారు .అయితే ఈ రహ దారి ప్రస్తుతం ఆక్రమణకు గురికా వడం పట్ల పలు విమర్శలు వినిపి స్తున్నాయి. కొంతమంది భూ వ్యాపారులు ఆర్డీవో కార్యాలయమునకు వెళ్లే రహదారిని ఆక్రమించుకోవడంతో సుమారు 45 అడుగులు ఉండవలసిన రహదారి 12 అడుగులకే పరిమితమైందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం జిల్లా అధికారులతో పాటు హాస్టల్ విద్యార్థులు కళాశాల సిబ్బంది రెవెన్యూ డివిజనల్ సిబ్బంది ఈ రహదారిని వాడుకుంటున్నారు. ప్రస్తుతం ఈ రహదారి ఆరడుగుల కుదించుకుపోయి ఇరుకు రోడ్డుగా మారడంతో రాకపోకలు సాగించడానికి కొలువు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఇదే రహదారిలో గల ఇంటిగ్రేటెడ్ వసతి గృహములో జరిగిన సంఘటన ఓ విద్యార్థికి పాము కలిసిన సంఘటన వెలుగు చూసింది. ఈ రహదారి ఇరుకుగా మారడంతో పాటు రహదారి ఇరువైపులా చెట్లు పొదలు పేరుకుపోవడంతో ఆ రహదారి గుండా నడవడానికి ఉద్యోగస్తులు విద్యార్థులు సైతం భయం చెందుతున్నారు. ఇరుగగా మారిన రహదారిపై అధికారులు దృష్టి సారించి ఆక్రమణకు గురవుతున్న రహదారిని నిబంధన ప్రకారం వాడుకులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదుపై డిఎల్‌పివో విచారణ

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రం, మేజర్ పంచాయతీలో తాను చేసిన వివిధరకాల పనులకు సంభందించి బిల్లులు ఇవ్వలేదని మాజీ జెడ్పిటిసి బండారుపెదబాబు ఇచ్చిన గ్రీవెన్స్ ఫిర్యాదు మేరకు బుధవారం డిఎల్‌పివో మోహనరావు జామి పంచాయతీ కార్యాలయానికి వచ్చి విచారణ నిర్వహించారు. విచారణకు ముందుగా ఫిర్యాది దారుడైన మాజీ జెడ్పిటిసికి, మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకటత్రివేణికి, ప్రస్తుత సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మలను విచారణకు రావాలని నోటీసులు అందించారు. ఉదయం 11గంటలకు విచారణ ప్రారంభించిన డిఎల్‌పివో ముందుగా సిబ్బంది తో చర్చించారు. అనంతరం అందరూ హాజరుకావడంతో విచారణ ప్రారంభించారు. తనకు 90లక్షల బిల్లులకు గాను 39 లక్షలు మాత్రమే ఇచ్చారని ఫిర్యాదు చేసిన పెదబాబును డిఎల్‌పివో తగిన ఆధారాలు ఇవ్వాలని కోరారు. ఈ సమయంలో ఫిర్యాదును చదువుతున్న సమయం లో ఉపసర్పంచ్‌పై వ్యక్తి గత ఆరోపణలు ఉండడంతో ఉపసర్పంచ్ అల్లుపద్మ అభ్యంతరం వ్యక్తం చేసారు. ఈసమయంలో మాజీ జెడ్పిటిసి బండారుపెదబాబు అక్కడనుంచి లేచి నాకు న్యాయం ఇక్కడ జరగదని అంటూ వెళ్ళిపోయారు. సిబ్బంది ఎంతలా బతిమిలాడినా ఆయన ఆగలేదు. అనంతరం పలు అంశాలపై మాజీ సర్పంచ్ త్రివేణి, ఇవోపిఆర్డి శ్రీదేవితోపాటు ప్రస్తుత సర్పంచ్‌ల వివరణ తీసుకున్నారు. విచారణకు హజరై మధ్యలో వెళ్ళిపోవడమే కాకుండా ఎటువంటి ఆధారాలు ఫిర్యాదు దారుడు ఇవ్వకపోవడం జరిగిందని, ఈవిషయాన్ని నివేదికలో నమోదు చేస్తానని డిఎల్‌పివో విలేఖరులకు తెలిపారు.

## కొత్త జూపిటర్ 113 సిసి వెహికల్ లాంచ్ చేసిన శ్రీనివాసరావు

విశాలాంధ్ర-బొబ్బిలి : టీవీఎస్ కంపెనీ నుంచి మరొక కొత్త వెహికల్ మార్కెట్లోకి రావడం జరిగింది. జూపిటర్ 113 సిసి విభాగంలో రెండు కొత్త వేరియంట్స్ తో మార్కెట్లోకి,అత్యాధునిక హంగులతో, మార్కెట్లోకి రావడం జరిగింది.ఈ వాహనాన్ని మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు అఫీషియల్ గా లాంచ్ చేశారు.ఈ వాహనం కస్టమర్లకు ఎంతో నచ్చుతుందని,టీవీఎస్ షోరూం అధినేత వారణాసి శ్రీహరి అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు,కస్టమర్లు, విజిటర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెరుమాలి అంగన్వాడి వన్ సెంటర్ లో పోషణ వారోత్సవాలు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో బుధవారం పెరుమాలి అంగన్వాడి వన్ సెంటర్‌లో పోషణ వారోత్స వాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ ఉషారాణి హాజరయ్యారు. వారితో పాటు అంగన్వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారని విలేకరితో సూపర్వైజర్ ఉషారాణి తెలిపారు.

## జెఎన్‌టియు జివి ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జేఎన్‌టియు జివి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (అటనమస్), లో బుధవారం ఎన్ఏఏసి న్యూ వెర్షన్, ఎన్ ఈపి, ఎన్ఐఆర్ఎఫ్ లపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ప్రొఫెసర్. పాల్, ప్రొఫెసర్. రవిచందర్ హాజరయ్యారు. ముందుగా యూనివర్సిటీ లోని డైరెక్టర్లు, వివిధ విభాగాల అధిపతులుతో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ కొత్త వెర్షన్, జాతీయ విద్యా విధానంపై చర్చించారు. ఎన్ఏ ఏసి లో ప్రస్తుతం అవలంబిస్తున్న విధానాలు, కొత్తగా అవలంబించబోయే విధానాలను వివరంగా తెలియచేసారు. కళాశాలలోని వివిధ విభాగాలు, ల్యాబ్‌లను పరిశీలిస్తూ తగిన సూచనలను, సలహాలను ఇచ్చారు. కార్యక్రమములో జెఎన్ టియుజివి ఇంఛార్జ్ ఉప-కులపతి ప్రొఫెసర్. డి.రాజ్యలక్ష్మి , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రాజేశ్వరరావు, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్.జి.జె. నాగరాజు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. జెఎన్టియు జీవి ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్) ను ఎన్ ఎ ఎ సి తీసుకువెళ్ళే లక్ష్యంతో కళాశాల ఇంచార్జి, ప్రిన్సిపాల్ అధ్వర్యంలోఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రామస్వామిపేటలో నేడు గ్రామసందర్శన

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తారని మండల అభివృద్ధిశాఖ అధికారి పట్నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు,ప్రజా ప్రతినిధులు, అందరూ పాల్గొనాలని ఆయన తెలిపారు.

## వృద్ధురాలు ఆత్మహత్య పై కేసు నమోదు

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం కారాడ గ్రామానికి చెందిన ఫిర్యాది, కూర్మదాసు అప్పల సూర్యనారాయణ తన తల్లి కూర్మదాసు రమణమ్మ, 60 సంవత్సరాలు వయసు పైబడి చూపు మందగించడం వల్ల నిన్నటి దినం అనగా ఈనెల 3 న ఉదయం 10 గంటల సమయంలో, ఇంట్లో ఫ్రిడ్జ్ పక్కన ఉంచిన టాయిలెట్ క్లీనింగ్ యాసిడ్ ను పొరపాటున మంచినీళ్లు అనుకుని తాగడం వలన బొబ్బిలి హాస్పిటల్ లో జాయిన్ చేశారు.. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం హాస్పిటల్ లో తరలించినప్పటికీ ఫిర్యాదు తల్లి నిన్న రాత్రి మృతి చెందడంతో .. తదుపరి పోలీ స్టేషన్లో రిపోర్టు ఇవ్వగా, ఎస్ హెచ్ ఓ . కె. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై, టి. శ్రీహరి కేసు నమోదు చేసి, శవ పంచనామా నిర్వహించి, మృతదేహాని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం గవర్నమెంట్ హాస్పిటల్ లకు తరలించారు.

## బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర-రామభద్రపురం: బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుంటే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడి సూపర్వైజర్ కృష్ణకుమారి అన్నారు. పౌష్టికాహార మాసొత్సవాల్లో భాగంగా బుధవారము ఆమె కొట్టక్కి గ్రామపంచాయతీలో తల్లులకు అవగాహన సమావేశము ఏర్పాటు చేశారు. సమావేశంలో పోషకాహారం గురించి తెలియజేస్తూ అంగన్వాడీలో ఇచ్చే బాల సంజీవిని కిట్టు పాలు, గుడ్లు తప్పనిసరిగా వాడాలని చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవడం వల్ల రక్తహీనతకు గురికాకుండా ఉండవచ్చని ఐరన్ రిచ్ ఫుడ్స్ అయినా బెల్లం, ఖర్జూరం, మునగాకు తీసుకోవాలని ఆకుకూరలు, పప్పులు కలిపి తినడం వల్ల న్యూట్రిషన్ వాల్యూస్ పెరుగుతాయని తల్లులకు తెలియజేయడమైనది. అనంతరం కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు సీమంతాలు చేయడం జరిగింది అలాగే తల్లులతో ర్యాలీ చేయడం జరిగింది . పోషకాహారం గురించి తెలియజేస్తూ అంగన్వాడీలో ఇచ్చే బాల సంజీవిని కిట్టు పాలు, గుడ్లు తప్పనిసరిగా వాడాలని చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవడం వల్ల రక్తహీనతకు గురికాకుండా ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు సీమంతాలు చేయడం జరిగింది తల్లులతో ర్యాలీ చేయడం జరిగింది కార్యక్రమంలో 0మహిళా సంరక్షణ కార్యదర్శి శోభారాణి అంగన్వాడి కార్యకర్తలు పార్వతి, అరుణ, దేవి, నారాయణమ్మ పాల్గొన్నారు